ప్రజాశక్తి
శనివారం 11 అక్టోబర్ 2025 5
అనంతపురం



వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తా... మహిళా కూలీ మృతి

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - శింగనమల

వేరుశనగ కట్టె ఆడించే మిషన్ ట్రాక్టర్ బోల్తా పడి మహిళా కూలీ మృతి చెందిన ఘటన గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఈప్రమాదానికి సంబందించిన వివరాలు.. గార్లదిన్నె మండలం తరిమెల గ్రామానికి చెందిన 10 మంది కూలీలు వేరుశనగ నూర్పిడి మిషన్‌కు కూలి పనులకు వెళ్లారు. వేరుశనగ పొలంలో పనిముగించుకుని వేరుశనగ నూర్పిడి మిషన్ ట్రాక్టర్‌లో స్వగ్రామానికి బయలు దేరారు. అయితే వీరి ట్రాక్టర్ గుడ్డాలపల్లి సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తరిమెల గ్రామానికి చెందిన మలిశెట్టి నాగలక్ష్మి (35) అక్కడికక్కడే మృతిచెందింది. తరిమెల గ్రామానికి చెందిన దళిత రంగస్వామికి కాళ్లు, చేతులు విరిగాయి. అదే విధంగా ట్రాక్టర్ యజమాని జగన్ ఎస్సీ మాది కులముకు చెందిన రెండో వ్యక్తి రంగస్వామి ఈయనకు 35 సంవత్సరాల కలవు పూర్తిగా కాళ్లు చేతులు విరిగి పోవడం జరిగింది. ఈయనకు భార్య నాగేంద్రమ్మ. పిల్లలు ముగ్గురు కలరు. తిరుమలేశా పది సంవత్సరాలు ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నారు. రెండు మేఘన ఒకటవ తరగతి. త రిమల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నది మూడు విశాల్ నాలుగు సంవత్సరాలు కలదు. మిగిలిన కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



ప్రమాద దృశ్యం



నాగలక్ష్మి (ఫైల్‌ఫొటో)

బాధితులను ఆదుకోవాలి : వ్యకాసం

వేరుశనగ నూర్పిడి మిషన్ ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో మృతిచెందిన నాగలక్ష్మి కుటుంబాన్ని, క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, నాయకులు రామాంజినేయులు, సుంకన్న డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఈసందర్భంగా వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూలి పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకునే వారు ఇలా ప్రమాదంలో గాయపడటంతో వారి కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ప్రమాదంలో మృతిచెందిన నాగలక్ష్మి కుటుంబంతో పాటు గాయపడిన వారందరూ పేదవారేనని అన్నారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి రూ. 50 లక్షలు ఎక్స గ్రేషియా ఇవ్వాలని, గాయపడిన వారికి రూ. 30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రి స్వామి, గమ్మాలయ్య, రామాంజనేయులు, ఆవుల రామాంజి తదితరులు పాల్గొన్నారు.



అదే ఉత్సాహం



సాంస్కృతిక ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎస్ఎస్‌బిఎన్ కళాశాల కార్యదర్శి నిర్మల

మహిళల హక్కుల సాధనకు ఐద్వా కృషి అభినందనీయం
ఎస్ఎస్‌బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి నిర్మల
రెండో రోజు కొనసాగిన సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహిళల హక్కుల సాధనకు ఐద్వా కృషి అభినందనీయమని ఎస్ఎస్‌బిఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మల పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో ఈ నెల 13, 14, 15 తేదిల్లో జరగనున్న ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో కృష్ణకళామందిరంలో నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాలు శుక్రవారం ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ప్రదర్శించిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రముఖులు సందర్శించి అక్కడ ఉన్న క్యూఆర్ కోడ్‌తో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రెండవ రోజు నిర్వహించిన సాంస్కృతిక ఉత్సవాలు రెట్టింపు ఉత్సాహంతో కొనసాగాయి. డ్యాన్స్ మాస్టర్ వన్నూరు స్వామి ఆహ్వానితులుగా కొనసాగిన కార్యక్రమానికి ఎస్–ఎస్‌బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి నిర్మల ముఖ్య అతిథిగా హాజరై సాంస్కృతికఉత్సవాలను ప్రారంభించారు. రచయిత షేక్ రియాజుద్దీన్ వేమన పద్యగానం చేశారు.

మహిళల హక్కుల పరిరక్షణకు ఐద్వా కృషి ఆదర్శం

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఐద్వా చేస్తున్న కృషి ఆదర్శనీయమని ఎస్ఎస్‌బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి నిర్మల అన్నారు. మహిళలకు ఎక్కడ సమస్యలు ఎదురైనా రక్షణగా ఐద్వా ముందుండి పోరాడుతోందన్నారు. ప్రశ్నించడంతో పాటు పోరాడే పటిమతో ఐద్వా అందరికి చేరువైందన్నారు. అన్యాయం జరిగినప్పుడు గొంతెత్తి బాధితుల పక్షాన తామున్నామంటూ నిలబడుతున్నారని తెలిపారు. ఐద్వా రాష్ట్ర మహాసభల సందర్భంగా సాంస్కృతికఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఐద్వా సాంస్కృతిక ఉత్సావాల్లో భాగంగా విద్యార్థినుల కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సంధ్యామూర్తి శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్యం, డ్యాన్స్ మాస్టర్స్ వన్నూరు, విష్ణు శిష్యులు ప్రదర్శించిన నృత్యాలు, రూట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన ముఖాభినయం, గుంతకల్ విద్యార్థినిలు ప్రదర్శించిన వరకట్నం వేధింపులపై ప్రదర్శించిన నాటిక, ఆలోచింపజేశాయి. ఫోక్ డ్యాన్, క్లాసికల్, మైమ్ ప్రదర్శనలు చేశారు. తరిమెల రాజు, పవన్ నిర్మించిన డ్రగ్‌ఫ్రీ ఇండియా లఘుచిత్రాన్ని ఈనెల 19న ఎన్‌మ్యాక్స్ థియేటర్‌లో ప్రదర్శిస్తున్న సందర్భంగా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, జిల్లా నాయకులు రామాంజినమ్మ, శైలజ, గీత, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గిరి, పరమేష్, ప్రజానాట్య మండలి శ్రీనివాసులు బృందం తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురం నగరంలో నిర్వహిస్తున్న 16వ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను శుక్రవారం విడుదల చేశారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక తదితరులు శుక్రవారం గణేనాయక్ భవన్‌లోని ఐద్వా కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ మహిళాభివృద్ధికి ఐద్వా చేస్తున్న పోరాటాలను వివరించారు. ఆస్తి హక్కు, వరకట్న వేధింపుల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, నిర్భయ గృహ హింస వంటి అనేక చట్టాలను సాధించుకోవడానికి అనేక ఉద్యమాలను ఐద్వా చేపట్టిందని గుర్తు చేశారు. కేవలం లింగ సమానత్వం మాత్రమే కాదు జాతీయ, మత, కుల, ప్రాంత, భాషా భేదాలకు వ్యతిరేకంగా పోరాడే ప్రగతిశీల మహిళా ఉద్యమం ఐద్వా అని ఆమె తెలిపారు. 13న నగరంలో భారీ ర్యాలీ, అదే రోజున లలితకళాపరిషత్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. 14, 15 తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలకు ఐద్వా ఆలిండియా కార్యదర్శి మరియం దావలె, కేరళ మాజీ మంత్రి శ్రీమతి, సామాజికవేత్త, హైకోర్టు న్యాయవాది సీస్తాశీతల్వాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. అక్టోబర్ 13, 14,15 తేదీలలో నగరంలో జరుగుతున్న 16వ రాష్ట్ర మహాసభల్లో జిల్లా వాసులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి అశ్విని, జిల్లా నాయకురాలు రామాంజినమ్మ, అక్కమ్మ, వెంకటరమణమ్మ, సునంద, కృష్ణవేణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకురాళ్లు



డిఎఫ్ఐ షార్ట్‌ఫిలిం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు



నృత్యకళాకారిణిలను ప్రశంసాపత్రం,షీల్డ్ అందజేస్తున్న అతిథులు



ఉత్సవాలకు హాజరైన మహిళలు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - పుట్లూరు

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా పుట్లూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు పుట్లూరు గ్రామానికి చెందిన పెద్దిరాజు(38) మూడున్నర ఎకరా పొలాన్ని మూడు సంవత్సరాల నుంచి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. వీటితోపాటు జెసిబి, ట్రాక్టర్లు పెట్టుకొని బాడుగకు వెళ్లేవారు. ఈనేపథ్యంలో పంటలు సరిగా పండక, జెసిబి, ట్రాక్టర్ బాడుగలు సరిగా రాక దాదాపు రూ. 5 లక్షల దాకా అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు తాడపత్రి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి అనంతపురం ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈ మేరకు మృతుని కుటుంబసభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బిటిపిని పరిశీలిస్తున్న ఆనంద్

బిటిపిని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మగట్ట

మండల పరిధిలో గల భైరవాని తిప్ప ప్రాజెక్ట్ (బి టి పి)ను కలెక్టర్ ఆనంద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈ ఈ సురేంద్రబాబు కలెక్టర్‌కు డ్యామ్ సామర్థ్యం దాని స్థితిగతులను వివరించారు. ప్రాజెక్టు కుడి కాలువ క్రింద 4000 ఎకరాలకు, ఎడమ కాలువ(బ్రహ్మసముద్రం మండలం) క్రింద ఎనిమిది వేల ఎకరాలకు నీరందిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్టు యొక్క సామర్థ్యం 55 అడుగులు కాగా ప్రస్తుతం నీటి నిలువ 51 అడుగులు ఉందన్నారు. ప్రాజెక్టుకు కర్నాటక రాష్ట్రం ఎగువన ఉన్న ప్రాజెక్టుల ద్వారా నీరు రావాలని చెప్పారు. కర్నాటక రాష్ట్రం ఇటీవల తమ రాష్ట్ర పరిధిలో చెక్ డ్యాం నిర్మించగా బీటీ ప్రాజెక్టుకు నీరు రావడం కష్టమైనట్లు వివరించారు. అనంతరం కలెక్టర్ స్థానిక ఎం జె పి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సకాలంలోనే నూతన భవనంలోకి పాఠశాలను మార్చటానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ విశ్వనాథరెడ్డి, ఎఇ హరీష్, తహశీల్దార్ రజాక్‌వలి, ఆర్ఐ రామాంజనేయులు, ఎంపీడీవో జయరాములు, వీఆర్వోలు, ఎంజెపి ప్రిన్సిపల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన కుటుంబం

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన, బలమైన కుటుంబ, సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని విప్ కాలవ శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక డ్వామా సమావేశ మందిరంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిగర్భం నుంచే పునాది పడాలన్నారు. తల్లి మంచి పౌష్టికాహారం తీసుకుంటే సంతానం కూడా బలంగా, దృఢంగా, ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. కావున తక్కువ ఖర్చుతో లభించే కాయగూరలు, ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారం లభిస్తుందని గుర్తు చేశారు. అనంతరం ప్రాజెక్టు పరిధిలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కొండన్న, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజేంద్రప్రసాద్, సిడిపిఒ ఎఎల్ పద్మావతి, సూపర్‌వైజర్ ఉమారాణి, టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు జ్యోతిలక్ష్మి, నాగరత్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వండి

అత్యంత వెనుకబడ్డ రాయదుర్గం నియోజకవర్గానికి ఉపాధ్యాయ ఖాళీల భర్తీలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆనంద్‌కు విప్ కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాయదుర్గంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో కలెక్టర్‌ను కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం 2025 మెగా డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయమై వినతిపత్రం అందజేశారు. రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం జిల్లాకేంద్రానికిఅత్యంత దూరంగా, వెనుకబడిన ప్రాంతంగా ఉందని వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రస్తుతం 315 ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1081 ఖాళీలు ఉండగా, అందులో దాదాపు మూడోవంతు 315 ఖాళీలు రాయదుర్గం నియోజకవర్గంలోనే ఉన్నాయని అన్నారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల సంఖ్య, విద్య నాణ్యత తగ్గే ప్రమాదం ఉందని తెలిపారు. కావున డీఎస్సీ నియామక ప్రక్రియలో రాయదుర్గానికి గరిష్ట సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.



వంటకాలను పరిశీలిస్తున్న విప్ కాలవ

వీధికుక్కల స్వైరవిహారం

భయాందోళనలో ప్రజలు

బొమ్మనహాల్ : మండలవ్యాప్తంగా గ్రామాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామాల్లో గుంపులుగుంపులుగా వీధికుక్కలు ఉండి వాహనదారులు, ప్రజలను కరుస్తున్నాయి. ముఖ్యంగా బొమ్మనహాల్‌తోపాటు ఉద్దేహాల్, దేవగిరి, హొన్నూరు, గోవిందవాడ, గొల్లలగుడ్డం, అరేసముద్రం, గోనేహాల్, శ్రీధర్‌ఘట్ట గ్రామాల్లో విచ్చలవిడిగా వీధి కుక్కలు తిరుగుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఒకవేళ కుక్కలు కాటు వేస్తే చికిత్సకు బళ్లారికి వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వీధికుక్కలను అరికట్టాలని మండలవాసులు కోరుతున్నారు.



గుంపులు గుంపులుగా ఉన్న వీధి కుక్కలు

భారీ వర్షం

200 ఎకరాల్లో నీట మునిగిన పంటలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారుజామున ప్రారంభమైన వర్షం ఉదయం 7 గంటల వరకూ పడింది. దీంతో దాదాపు 83 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా మండలంలోని సిద్ధరాంపురం, కురవల్లి, చంద్రగిరి, అగ్రేసముద్రం, బొల్లనగుడ్డం, కళ్లుహోళ, తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో దాదాపు 200 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, తెల్లజొన్న, ఎర్రజొన్న పంటలు నీట మునిగాయి. పంట నష్టంతో రైతులు లబోదిబోమన్నారు. పంటలు కోసి నేపథ్యంలో మొక్కజొన్న, ఒక అడుగు ఎత్తులో ఉన్న వరిపంట, మొక్కజొన్న, తెల్లజొన్న పంటలు నీట మునిగాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.



నీట మునిగిన మొక్కజొన్న పంట

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రాప్తాడు : జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన వేరుశనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని లింగన్నపల్లి గ్రామంలో రైతు సుబ్బిరెడ్డి సాగు చేసిన ఐదెకరాల్లో పంటను ఎపి రైతుసంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతు సుబ్బిరెడ్డి సుమారు ఐదెకరాల్లో సాగు చేసిన పంటను తొలగించి కుప్పలుగా వేసుకున్నాడన్నారు. దీంతో వర్షాలకు పంట అంతా దెబ్బతిని నష్టపోయాడన్నారు. ఈయనతోపాటు అనేక మంది రైతులు నష్టపోయారన్నారు. రైతులు దిక్కు చేతులు పరిస్థితుల్లో ఉన్నారన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.పోతలయ్య, సాయినాథ్‌రెడ్డి, బ్రహ్మయ్య, తదితరులు ఉన్నారు.



తడిసిన వేరుశనగ పంటలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అతిథులు

ట్రెల్లిస్ స్కూల్‌లో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు

అతిథులుగా హాజరైన ఇస్రో శాస్త్రవేత్త దీపక్‌సింగ్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని ట్రెల్లిస్ స్కూల్ తన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను విజయవంతంగా ముగించింది. విద్యార్థులు, ఇస్రో శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులను ఒకచోట చేర్చిన గ్రాండ్ ఫినాలేలో ఘనంగా ట్రెల్లిస్ స్కూల్ ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఇస్రో శాస్త్రవేత్త దీపక్ సింగ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ది ట్రెల్లిస్ స్కూల్‌లోని డాక్టర్ నీలేష్, ఎం.దేశాయ్ స్పేస్ సెంటర్‌లో పాల్గొనడానికి ఎంపికైన వివిధ మండలాల నుంచి 38 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వారంరోజుల శిక్షణ కార్యక్రమం ఫలితంగా ఈ వేడుకలు జరిగాయి. శిక్షణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అంతరిక్ష అవగాహన, విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని ట్రెల్లిస్ సంస్థ అధినేత వడ్ల శ్రీకాంత్ తెలిపారు. 19 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించి, నలుగురు అహ్మదాబాద్‌లోని ఇస్రో ఎస్‌ఎసికి ఉచిత యాత్రను గెలుచుకున్నారన్నారు. ఈ కార్యక్రమాన్నివిజయవంతం చేయడంలో అవిశ్రాంత కృషి చేసినందుకు ఛైర్మన్ శ్రీకాంత్ వడ్లా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నష్టాల్లో తమలపాకు రైతులు

తగ్గిన ఆదాయం - దిగుబడి ఉన్నా సరైన ధరల్లేక నష్టాలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

1ఏ శుభకార్యం జరగాలన్నా తాంబూలందే మొదటి ప్రాధాన్యం. ఆకు, వక్క సున్నం కలగలిపిన తాంబూలం వేసుకోవడాన్ని ఓ సంప్రదాయంగా భావిస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన తమలపాకు పంట రైతులకు నష్టాన్ని తెచ్చిపెడుతోంది. తమలపాకు పంట సాగు ఒక వ్యవహారం అయితే చీడ, పీడల నుంచి తోటలను కాపాడుకోవడం రైతులకు కత్తిమీద సాములా మారింది.

పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడులో ఎక్కువ మంది రైతులు తమలపాకు పంటను సాగు చేస్తుంటారు. దాదాపు వంద మంది రైతులు తమలపాకు సాగు చేశారు. ఎంతో ఆదాయాన్ని ఇస్తాయనుకుంటున్న తమలపాకు పంటలు నష్టాన్నే మిగుస్తున్నాయి. గత మూడేళ్లుగా ఈ పంటలో ఆదాయం లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ ఏడాది ప్రస్తుతం వాటి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ఏడాదికేడాది తెగుళ్లు, ధరల తగ్గుదలతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఇప్పటికే ఈపంటకు పెట్టిన పెట్టుబడులు రాక అనేక మంది రైతులు పొలాల్లోనే పంటలను వదిలేస్తున్నారు. 30 కట్టల ఆకులు రూ.200 ధర ఉండగా, వంద కట్టల ఆకులు రూ.500 ధర పలుకుతోంది. ఈధరలతో ఎంతమాత్రం గిట్టుబాటు కావడంలేదని రైతులు చెబుతున్నారు. పంటలకు సాగుకోసం రైతులు వారి ఆస్తులను సైతం తాకట్టు పెట్టారు. అనుకున్న స్థాయిలో ఈ పంటలో ఆదాయం రాకపోవడంతో రైతులకు అప్పులే మిగిలియి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలంటూ తమలపాకు రైతులు వేడుకుంటున్నారు.


తమలపాకులను కోస్తున్న కూలీలు


తమలపాకుల తోట

ఐసిడిఎస్‌ను గాడిన పెడతాం : పీడీ


పీడీని సన్మానిస్తున్న సిబ్బంది

అనంతపురం : జిల్లా శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలను లబ్ధిదారులకు సక్రమంగా అందించి ఐసిడిఎస్‌ను గాడిలో పెడతామని ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణకుమారి తెలిపారు. ఐసిడిఎస్ పీడీగా అరుణకుమారి శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పిడి ప్రజాశక్తితో మాట్లాడుతూ ఐసిడిఎస్ ప్రాజెక్టులో లోటుపాట్లను చక్కదిద్దుతామన్నారు. అనంతరం పలువురు పీడీకి బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

పథకాలపై డిఆర్‌డిఎ పీడీ సమీక్ష


మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ

రాయదుర్గం : రాయదుర్గం ప్రాజెక్టు పరిధిలో అమలవుతున్న వివిధ పథకాల నిర్వహణపై దుర్గాదేవి మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా పిఎంఎఫ్‌ఎంఇ, పిఎంఇజిపి పథకం, ఉన్నతి స్త్రీనిధి బ్యాంకు రుణాలు, పెరటి తోటల పెంపకం, జీవనోపాదులు, రైతు సంఘాల సమావేశాల నిర్వహణ, మునగ/వెదురు సాగు వల్ల లాభాలు, సీడ్ క్యాపిటల్ రికవరీ, కుట్టు, ఫొటోగ్రఫీ శిక్షణ, ప్రకృతి వ్యవసాయంపై సమీక్షించారు. ఈ సమావేశంలో జీవనోపాదుల విభాగం డిపిఎం గంగాధర్, ఇన్‌ఛార్జి ఎసి గోవిందప్ప, ఎపిఎంలు, సీసీలు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ ప్రాజెక్టులపై సమీక్ష


మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీంబాషా

అనంతపురం : స్థానిక డ్వామా మీటింగ్ హాల్‌లో వాటర్‌షెడ్స్ పథకం కింద అమలవుతున్న ఏడు ప్రాజెక్ట్‌లపై పీడీ సలీంబాషా శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్‌షెడ్స్ పథక అధికారులు, జూనియర్ ఇంజనీర్లు, సాంకేతిక అధికారులతో ఏర్పాట్లు చేసి మూడు నెలల్లోపు లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు పథక సంచాలకులు సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణచైతన్య, అధికారులు, ఇంజినీర్లు, సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జిఎఫ్ స్కూల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం సిటీ : ఆర్డీటీ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఎస్‌జిఎఫ్ అండర్ 14, 17, 19 జిల్లా సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ కార్యదర్శులు శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, ప్రభాకర్, ఆంజనేయులు, కళా సుధాకర్, ప్రసాద్, మల్లికార్జున, మంజుల, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్ రాఘవేంద్ర, రెఫరీ పవన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ధన్ ధాన్య కృషి' ప్రారంభం

అనంతపురం : ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకాన్ని శనివారం ఢిల్లీలో ప్రధాని ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న రెవెన్యూ భవన్‌లో కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

12న 'నందవరం' పుస్తకావిష్కరణ

అనంతపురం : ప్రసిద్ధ కవి, కథా రచయిత నందవరం కేశవరెడ్డి రచించిన జుగల్బందీ పుస్తకాన్ని ఈనెల 12న ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఆవిష్కరించనున్నట్లు అరసం ప్రధాన కార్యదర్శి తన్నీరు నాగేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ఉపాధి'లో అవినీతిపై ఫిర్యాదు



పీడీతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

అనంతపురం : కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో టిడిపి నాయకులు చేస్తున్న అవినీతిపై పీడీ సలీంబాషాకు వైసిపి నియోజరవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా ఇందుకు సంబంధించిన ఆధారాలను పీడీకి అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో వైసిపి సీనియర్ నాయకులు రాళ్ల అనంతపురం భీమేష్, కైరేవు గంగాధర్, తదితరులు ఉన్నారు.

వైద్యుల ఖాళీల భర్తీకి వినతి

రాయదుర్గం : పట్టణంలోని ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పోస్టులు భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రతాపరెడ్డి కోరారు. ఈమేరకు నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన కలెక్టర్‌ను శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కలిసి పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా 22 మంది డాక్టర్లకు ఆరుగురే ఉన్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ సాధ్యమైనంత త్వరగా డాక్టర్ల నియామకం కోసం కృషి చేస్తానని తెలిపారు. వంద పడకల ఆసుపత్రి కోసం కొత్త భవన నిర్మాణానికి అవసరమైన నిధులు రాబట్టడంలో కృషి చేయాలని కోరారు. అలాగే కొద్దిపాటి వర్షానికి రాయదుర్గంలో లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

అవార్డు గ్రహీతకు సిఐటియు నాయకుల సన్మానం


అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుడు ఈశ్వరప్ప పెద్దకుమారుడు పృథ్వీరాజ్‌కు నేషనల్ అవార్డు రావడంతో సిఐటియు నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆక్టోబర్ 6వ తేదీన ఎన్‌ఎస్‌ఎస్ అవార్డును రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో పృథ్వీరాజ్ అవార్డు అందుకున్న సంగతి విధితమే. దీంతో కళ్యాణదుర్గంలో పృథ్వీరాజ్‌తోపాటు ఆయన తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర గౌరవాధ్యక్షులు జి.ఓబులు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ, సిఐటియు మండల కార్యదర్శి రంగనాథ్, కోశాధికారి వన్నూర్‌స్వామి, ఆర్గనైజర్ నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు పాతక్క, గంగమ్మ, గౌరి, ఇతర కార్మికులు రమేష్, అంగన్‌వాడీ యూనియన్, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్, విఆర్‌ఎల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మానసిక దృఢత్వంతోనే ఆరోగ్యం

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ విజయశ్రీ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ విజయశ్రీ, వైద్య సిబ్బంది


ప్రజాశక్తి-అనంతపురం

మానసిక అనారోగ్యం శారీరక అనారోగ్యం లాంటిదే అని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక వైద్య కళాశాలలో మానసిక ఆరోగ్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానసికంగా ఆరోగ్య సమస్యలు ఉన్న బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు, మానసిక ఆరోగ్య సమస్యలు, నివారణలు, వారికి మద్దతు ఇవ్వడం, అవగాహన కల్పించేందుకే మానసిక ఆరోగ్య దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. మానసిక వైద్య విభాగ అధిపతి డాక్టర్ శారద మాట్లాడుతూ నిద్ర, తినే విధానాల్లో మార్పులు, నిరంతర విచారం, సంఘవిద్రోహ ప్రవర్తన, మానసిక స్థితి మార్పులు వంటివి మానసిక అనారోగ్యానికి సంకేతాలు అన్నారు. ఆయా లక్షణాలు కనిపిస్తే వెంటనే మానసిక ఆరోగ్య నిపుణులతో సాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శౌరీ, వైస్ ప్రిన్సిపాల్ శంకర్, మధు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుమన గోపీచంద్, మానసిక వైద్య విభాగం నుంచి డాక్టర్ రవికుమార్, డాక్టర్ వరదరాజులు, పీజీ విద్యార్థులు కల్యాణ్, లక్ష్మీప్రసన్న, యశ్వంత్, సోనాలి, మెడికల్ కాలేజ్ డాక్టర్లు , వైద్య విద్యార్థులు, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : జీవితంలోని సవాళ్లను ఎదుర్కొవడానికి, ఒత్తిడిని తట్టుకోవడానికి, లక్ష్యాలను సాధించడానికి విద్యార్థినులు మానసిక దృఢత్వంగా ఉండాలని మండల విద్యాధికారి బి.రవి నాయక్, సమగ్ర శిక్ష అభియాన్ మానసిక ఆరోగ్య కౌన్సిలర్ బి.నాగమణి సూచించారు. శుక్రవారం పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రిన్సిపాల్ ఎం.రుద్రాక్షి అధ్యక్షతన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ రవి నాయక్, కౌన్సిలర్ నాగమణి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, నియంత్రణ, నిబద్ధత, సవాళ్లను స్వీకరించే గుణాలతో కూడిన మానసిక దఢత్వం కలిగి ఉండాలన్నారు. అనంతరం చిత్రలేఖన పోటీలు, విద్యార్థునులతో యోగా చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ ధరల బోర్డులు ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


జీఎస్టీ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, నాయకులు

ప్రజాశక్తి-నార్పల

దుకాణదారులు తమ దుకాణాల్లో తప్పనిసరిగా తగ్గిన జీఎస్టీ ధరలపై బోర్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణ శ్రీ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని తగ్గించడంతో తగ్గిన వస్తువుల బోర్డును దుకాణాల ముందు ఉంచాలని సూచించారు. తగ్గిన ధరలతో విక్రయాలు సాగించకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయ్‌కుమార్ (బాబు), వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుళ్లాయప్ప, జీసీ బాబు, ప్రతాప్‌చౌదరి, దారపనేని చంద్రబాబు, సాగునీటి సంఘం అధ్యక్షులు ఆలం నాగార్జున నాయుడు, పరంధామ, పసుపులేటి లక్ష్మీనారాయణ, సుల్తాన్‌పేట మహేష్‌నాయుడు, ప్రకాష్‌నాయుడు, శివానాయుడు, బింగి తిరుపతయ్య, బాలనాగి నరేష్, చిన్నచౌదరి, శ్రీనివాసులు గూగూడు నర్సింహులు, ఓబులేసు, జాఫర్, హరీష్, టివిల రామానాయుడు, వెంకటంపల్లి వెంకటేశ్వరనాయుడు, జనసేన నాయకులు గంజిగుంట రామకృష్ణ, తుపాకుల భాస్కర్, బిజెపి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్ర, తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఓ శేషారెడ్డి, డిప్యూటీ ఎంపిడిఓ శైలజారాణి, ఎంఇఓ కృష్ణయ్య, ఎపిఓ రమేష్ రామారావు, ఎపిఎం తిప్పక్క, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంతో ఆర్థిక స్వావలంబన


గొర్రెలకు టీకాలు వేస్తున్న వైద్యులు, అధికారులు

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వ రాయితీ కింద రుణాలు పొంది గొర్రెల పెంపకం ద్వారా రైతులు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని పశువైద్యులు ప్రదీప్‌కృష్ణ, కర్ణాటక బ్యాంకు జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్ సూచించారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని సురసింగనపల్లి సమీపంలో ఏడాదిన్నర క్రితం మంజూరైన గొర్రెల పెంపకం యూనిట్‌ను పశువైద్యులు, కర్ణాటక బ్యాంకు జనరల్ మేనేజర్ శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా గొర్రెల పెంపకం, షెడ్డు, సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించడంతోపాటు గొర్రెలు, పొట్టేళ్లకు ట్యాగ్‌లు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఇచ్చే రాహితీ రుణాలను వినియోగించుకుని రైతులు లబ్ధి పొందాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద రైతు కె. ప్రభావతికి 50 శాతం రాయితీతో రూ.కోటి మంజూరు చేసిందన్నారు. యూనిట్‌లో ఒక్కొక్కటి రూ.10,800 విలువజేసే 500 గొర్రెలు, రూ.14,700 ఒక్కొక్కటి విలువచేసే 25 పొట్టేళ్లు ఉన్నాయన్నారు. లబ్ధిదారుకు ఖాతాకు 25 శాతం రాయితీ జమ చేశానన్నారు, త్వరలో మిగిలిన రాయితీ జమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక బ్యాంక్ క్షేత్ర అధికారి వినోద్, గొర్రెల పెంపకం యూనిట్ నిర్వాహకుడు,రైతు జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమం' పోస్టర్ విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల 'ప్రజా ఉద్యమం'కు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 2019కి ముందు 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలల మాత్రమే ఉన్నాయన్నారు. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక వైద్య విద్యతో పాటు వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయడానికి వైసిపి ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.8300కోట్లతో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. కోవిడ్ తర్వాత ప్రారంభించి రెండేళ్లలోనే ఏడు మెడికల్ కళాశాలలు పూర్తి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పిపిపి పేరుతో తన బంధువులు, తన వర్గాలకు ఆదాయం సమకూర్చడానికి చంద్రబాబు పూనుకున్నారన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో నవంబర్ 22వతేదీన కోటి సంతకాల సేకరణ కోసం ప్రజా ఉద్యమం ప్రారంభిస్తున్నట్లు వివరించారు. తర్వాత నియోజకవర్గ కేంద్రాలు, జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మేధావులు, ప్రజాసంఘాలు, వామపక్షాలు భాగసామ్యం కావాలని పిలుపునిచ్చారు.

జీఎస్టీ 2.0తో వస్త్ర పరిశ్రమలకు ప్రోత్సాహం

విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ ఆనంద్


గార్మెంట్ కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-రాయదుర్గం

జీఎస్టీ 2.0తో వస్త్ర పరిశ్రమలకు ప్రోత్సహం లభిస్తుందని విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌లో భాగంగా రెడీమేడ్ గార్మెంట్స్‌కు 5 శాతం రేట్ అఫ్ ట్యాక్స్‌లో ఉంచడం ఒక వరం అన్నారు. ప్రజలకు మేలు చేయాలనే తపనతో ఎన్‌డిఎ ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలను అమలు చేసిందన్నారు. కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో పేద, మధ్య తరగతి వారికి ప్రతినెలా రూ. 15 వేలు ఆదా అవుతుందన్నారు. చిన్న కుటీర పరిశ్రమలకు పెట్టుబడి భారం తగ్గుతోందన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం బళ్లారి రోడ్డు వద్ద ఉన్న కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయదుర్గంలో గార్మెంట్ పరిశ్రమ అభివృద్ధికి కామన్ ఫెసిలిటీ సెంటర్లో కుట్టు కార్మికులకు అవసరమైన శిక్షణ, పరిశ్రమ నిర్వహణకు అవసరమైన పెట్టుబడి సాయం రుణం అందజేస్తామన్నారు. తర్వాత ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. మౌలిక సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే 74-ఉడేగోళం వద్ద ఉన్న టెక్స్‌టైల్ పార్కును కలెక్టర్ సందర్శించి అక్కడి స్థితిగతులు, చేనేత, జౌళి శాఖ, పరిశ్రమల శాఖ అధికారులు, ఉత్పత్తిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో వాణిజ్య పన్నుల శాఖ, కళ్యాణదుర్గం అసిస్టెంట్ కమిషనర్ సుజిత, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్‌యాదవ్, చేనేత పరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్, డిసిటిఓ సురేష్‌కుమార్, తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ కొండన్న, మున్సిపల్ డిఇ సురేష్, గార్మెంట్స్ వర్తకులు, టంకశాల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

90శాతం సబ్సిడీతో పప్పుశనగ ఇవ్వాలి

ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు

ప్రజాశక్తి-బెలుగుప్ప

జిల్లాలోని రైతులకు 90శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం 2025 రబీలో పప్పుశనగ 25 శాతం సబ్సిడీ ఇస్తామని ప్రకటించడం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. పప్పుశనగ బయట మార్కెట్‌లో రూ.5800 నుంచి రూ.6000 వరకూ ఉందన్నారు. ప్రభుత్వం రూ.7800 ధర నిర్ణయించి 25 శాతం సబ్సిడీ ఇస్తామనడం రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే అవుతుందన్నారు. పంటలు చేతికందక తీవ్ర సంక్షోభంలో ఉన్న రైతులు పంటలు సాగు చేయాలంటే 90 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలపై అవగాహన

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని జూటూరులో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాలలలో బాల్యవివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సూపర్‌వైజర్ విజయకుమారి గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై వివరించారు. ముఖ్యమంగా కౌమార దశలో వచ్చే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమన్నారు. చిన్న వయసులోనే పెళ్లి చేసుకోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగనవాడీ, ఆశా హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయకుమారి

పెన్షన్ పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని రద్దు చేయాలి

బిఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయం ఆవరణలో ధర్నా


ధర్నా చేస్తున్న కేంద్ర పౌర పెన్షనర్ల సంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇటీవల ఆర్థిక బిల్లులో ప్రవేశపెట్టిన పెన్షన్ పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వివిధ కేంద్ర పౌర పెన్షనర్ల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం అనంతపురంలోని తపాలా ప్రధాన కార్యాలయం, బిఎస్‌ఎన్‌ఎల్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షన్ పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని లిఖిత పూర్వకంగా రద్దు చేయాలని, దీనిపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, పెన్షన్ వ్యవహారాల కార్యదర్శి పెన్షనర్ల సంఘాల వెబ్ సమావేశం ఇచ్చిన హామీనిఅమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ కరుణా ధనం కాదని, సేవకు గౌరవప్రదమైన ప్రతిఫలం అన్నారు. అలాంటి పెన్షనర్ల భద్రతను ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కేంద్ర పౌర పెన్షనర్ల సంఘాల నాయకులు పద్మనాభాచారి, సుభాన్, బాలరంగయ్య, నాగేశ్వర్‌రెడ్డి, సిద్ధేశ్వర్, నరసింహులు, రామయ్య, వన్నప్ప, సుధాకర్, కృష్ణ, చంద్రశేఖర్ ఆచారి, మొహమ్మద్ అలీ, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన జయరంగారెడ్డి

పుట్లూరు : బొలేరో, ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయాలపాలైన ఘటన శుక్రవారం మండల పరిధిలోని గోపరాజుపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. గోపరాజుపల్లి గ్రామానికి చెందిన జయరంగారెడ్డి, అదే గ్రామానికి చెందిన ప్రశాంతి ఉపాధి హామీ పనులకు ఉదయమే ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. అయితే అదే సమయంలోనే తాడపత్రి నుంచి వస్తున్న బొలేరో గ్రామ సమీపంలో ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో వచ్చిన జయరంగారెడ్డి, ప్రశాంతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్తులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

వికలాంగ పిల్లలను ప్రోత్సహిద్దాం

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రత్యేక అవసరాలు ఉన్న దివ్యాంగ పిల్లలను ఇతరులతో సమానంగా ఎదిగేందుకు ప్రోత్సహిద్దామని విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఎపి మోడల్ స్కూల్లో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత పరికరాల ఎంపిక శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 500 మంది ప్రత్యేక అవసరాలు పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. వారందరికీ విద్యాబుద్ధులు నేర్పడంతోపాటు వారి అభిరుచిని బట్టి ఆయారంగాల్లో ప్రోత్సహించడానికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ కొండన్న, ఎంఇఒలు వెంకటరమేష్, మహమ్మద్ఇర్షాద్, భవానీ శంకర్, టిడిపి నాయకులు నాగరాజు, పురుషోత్తం, వెంకటేశులు, భారతి, ప్రశాంతి, కృష్ణమూర్తి, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రంగనాథ స్వామి ఆలయానికి రూ.1.88 లక్షల ఆదాయం

గుత్తి : మండలంలోని తొండపాడు శ్రీ బొలికొండ రంగనాథస్వామి ఆలయానికి తలనీలాల సేకరణ హక్కు వేలం ద్వారా ఆదాయం లభించింది. దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ అక్కిరెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారిణి ఎస్.శోభ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆలయ ఆవరణలో తలనీలాల సేకరణకు శుక్రవారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో రూ.20 వేలు చెల్లించి ఆరు మంది వేలంపాటలో పాల్గొన్నారు. పోటాపోటీగా జరిగిన వేలం పాటలో గ్రామానికి చెందిన గంగమ్మ రూ.1.88 లక్షలకు వేలంపాట దక్కించుకున్నారు. గతేడాది రూ.1.82 లక్షలకు వేలం పాట పోగా ఈ ఏడాది ఆలయానికి రూ.6వేలు అదనంగా ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.రంగస్వామిరెడ్డి యాదవ్, డేగ మద్దిలేటి, ఓబన్న, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

యాడికి : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 32 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. తర్వాత సమాజంలో ఆడపిల్లల ఆవశ్యకతపై ఐసిడిఎస్ సూపర్వైజర్ శంషాద్బేగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఆరోగ్య బీమా పాలసీలపై అవగాహన

అనంతపురం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీసు సిబ్బందికి 'పోలీసు వేతన ప్యాకేజీ-ప్రయోజనాలు, సఫైర్ సూపర్ హెల్త్ టాప్ ఆఫ్ హెల్త్ ఇన్సురెన్స్' పాలసీలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం సాయినగర్ బ్రాంచి ఎజిఎం నందగోపాల్, డిప్యూటీ బ్రాంచి మేనేజర్ నాగకుమార్ కలిసి స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నుండీ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని కానిస్టేబుళ్ల నుంచి పోలీసు అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పవన్కుమార్, పలువురు ఆర్ఎస్ఐలు, ఎఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు



అవగాహన కల్పిస్తున్న ఎఆర్ అదనపు ఎస్పీ



అనంతపురంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి



కళ్యాణదుర్గంలో మాట్లాడుతున్న సిడిపిఒ ప్రసన్నలక్ష్మి



బెలుగుప్పలో మాట్లాడుతున్న వక్తలు

బాలికలు కుటుంబానికి వెలుగులు

ప్రజాశక్తి-అనంతపురం

బాలికలు ప్రతి కుటుంబానికీ వెలుగులు అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్లో బాలికల హక్కులు, వారి విద్య, ఆరోగ్యం, భద్రత, సమాన అవకాశాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలిక ఒక కుటుంబానికి వెలుగుతోపాటు ఒకతరం అభివృద్ధికి మూలమన్నారు. బాలికల విద్య, ఆరోగ్యం, అవకాశాల్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితి మారాలంటే మనమందరం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి నాగరాజు, డిప్యూటీ డెమో త్యాగరాజు, ఐసిడిఎస్ పీడీ ఉమాశంకరమ్మ, ఎంఇఒ వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయురాలు రేణుక, సూపర్వైజరు ఝాన్సీరాణి, భారతి, లీలాకుమారి, జ్యోతి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేష్, వేణు, కిరణ్, లీగల్ కాన్సల్టెంట్ ఆశారాణి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : బాలికలు ప్రభుత్వాలు కల్పిస్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక జ్ఞానభారతి ప్రయివేట్ ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రమేష్బాబు అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ప్రసన్నలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, సీఐ హరినాథ్, ఎంపిఇఒ-2 బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అలాగే మండల పరిధిలోని దురదకుంట గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికలతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి ఎంపిడిఒ శివశంకర్, సూపర్వైజర్ అరుణశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు గోవిందమ్మ, రాజేశ్వరి, సుహాషిణి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో సిడిపిఒ చల్లా లలిత ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ పీడీ అరుణకుమారి బాలికా దినోత్సవ విశిష్టతను వివరించారు. ఈసందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఆర్.మంజునాథ్, కెజిబివి ప్రిన్సిపల్, సూపర్వైజర్ సిహెచ్ఒ మోహన్కుమార్, హెల్త్ సూపర్వైజర్ విజయలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ధనలక్ష్మి, డిసిపియు ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సోషల్ వర్కర్ వెంకట్కుమార్, బాలికలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో వక్తలు

బెలుగుప్ప : మండల పరిధిలోని దుద్దేకుంట జెడ్పీ హైస్కూలలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికలతో 'బాలికా శక్తికి, దేశ ప్రగతికి నూతన దీప్తి' అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, ప్రధానోపాధ్యాయులు బాలమురళీకృష్ణ, మహిళా పోలీస్ ప్రవీణ, ఎఎన్ఎం మధురిమ, అంగన్వాడీ కార్యకర్తలు మంజుల, దుర్గ, మంగమ్మ, ఆశావర్కర్లు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో సిడిపిఒ చల్లా లలిత ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కల్పన కౌసల్య, అంగన్వాడీ వర్కర్లు, కళాశాల సిబ్బంది, బాలికలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతకల్లు : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని వాటిని వ్యతిరేకించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్లు జె.పద్మావతి, కృష్ణవేణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవ సందర్భంగా శుక్రవారం దోనిముక్కల రోడ్డులో ఉన్న కెజిబివి పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని కస్తూరిబా పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్వైజర్ డివి నారాయణమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పిల్లల హక్కులు, విద్య, ఆరోగ్యం, అభివృద్ధి, బాల్య వివాహాలపై రాత పరీక్ష పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.సునాలిని, ప్రిన్సిపాల్ నిర్మల, ఎఎన్ఎం మంజుల, ఐసిడిఎస్ వసంతలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, విమల, ఈశ్వరమ్మ, స్వర్ణలత, స్వప్న, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శంషాద్బేగం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెల్త్ సూపర్వైజర్ షబ్బీర్, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యల్లనూరు : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్లు రాజామణి, శాంతమ్మ లింగ సమానత్వం, సైబర్ భద్రత, అక్షరాస్యత, రుతుక్రమం, పరిశుభ్రత, రక్తహీనత, భవిష్యత్తు ప్రణాళిక, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, ఎంఎస్కె నాగవేని, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో 'బాలికగా నాతోనే మార్పు' అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికల ఆరోగ్యం, శుభ్రత, పోషణ ప్రాధాన్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీకృష్ణారెడ్డి, ఎన్ఎఎం ప్రీతీ, ఛైల్డ్లైన్ 1098 సిబ్బంది ఇర్ఫాన్, ప్రథమ్ జిల్లా సమన్వయకర్త, జిఎంఎస్కె సభ్యులు అనురాధ, రేష్మా, ఆర్డిటి కౌన్సిలర్ నారాయణమ్మ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.





నార్పల, శింగనమలలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాట్లాడుతున్న వక్తలు

బడి బయట బాలుడిని పాఠశాలలో చేర్పించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలో యాచిస్తున్న ఓ బాలుడిని గుర్తించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వెంటనే బాలుడిని పాఠశాలలో చేర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక గూగూడు రోడ్డులో పలు దుకాణాలు, వ్యాపార సముదాయాల వద్దకు వెళ్తున్న ఎమ్మెల్యేకు ఓ బాలుడు యాచన చేస్తుండడం కంటపడింది. వెంటనే అక్కడే ఉన్న తహశీల్దార్ అరుణకుమారిని పిలిచి బాలుడి వివరాలు సేకరించి పాఠశాలలో చేర్పించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే బాలుడి దగ్గరకు వెళ్లి ఆరాతీయగా బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లి గ్రామానికి చెందిన శంకర్ కుమారుడు శీనుగా చెప్పాడు. తర్వాత మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డితో మాట్లాడి బాలుడిని పాఠశాలలో చేర్పించడంతోపాటు వసతి గృహంలో ఉండేందుకు చర్యలు చేపట్టారు. స్వయానా ఎమ్మెల్యే ఓ చిన్నారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపడాన్ని పలువురు ప్రత్యేకంగా ప్రశంసించారు.



ఎమ్మెల్యే అప్పజెప్పిన చిన్నారితో తహశీల్దార్ అరుణకుమారి, డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, విఆర్ఒ రామాంజి